నమస్తే తెలంగాణ



## డ్రగ్స్‌కు బానిసై.. తండ్రిని కడతేర్చిన కొడుకు

- పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య
- రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలో ఘటన

ఆదిబట్ల, ఏప్రిల్ 4 : డ్రగ్స్‌కు బానిసైన ఓ యువకుడు కన్నతండ్రిని అత్యంత దారుణంగా హతమార్చాడు. ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి, ఆపై తలపై బండరాయితో మోది హత్యచేశాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయాంజాల్ పట్టణ పరిధిలోని ఆరెంజ్ అవెన్యూకాలనీకి చెందిన తిరుపతి రవీందర్(60), సుధ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. రవీందర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా.. పెద్ద కుమారుడు అనురాగ్ మత్తు పదార్థాలకు అలవాటు పడి.. తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. గురువారం మధ్యాహ్నం తల్లి ఓ గదిలో ఉండగా తాళం వేసిన అనురాగ్ తండ్రితో గొడవపడ్డాడు. తండ్రిపై పెట్రోల్ పోసేందుకు యత్నించగా అతడు భయంతో బయటికి పరుగులు తీశాడు. వెంబడించి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తలపై బండరాయితో మోది హత్య చేశాడు. పోలీసులు ఘటనాస్థలికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

# ఏనుగు దాడిలో మరో రైతు మృతి

- ఏనుగు సంచరిస్తున్న ప్రాంతాల్లో 144 సెక్షన్
- అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి
- అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం



పోశన్న (ఫైల్)

హైదరాబాద్/కుమ్రంభీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)/బెజ్జూర్: మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదిని దాటి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఓ ఏనుగు 24 గంటల్లోనే ఇద్దరిని బలి తీసుకున్నది. బుధవారం మధ్యాహ్నం చింతలమానేపల్లి మండలం బూరెపల్లి సమీపంలో మిరపకాయలు ఏరుతున్న అల్లూరి శంకర్ (55)ను తొండంతో కొట్టి చంపింది. గురువారం తెల్లవారుజామున పెంచికల్‌పేట్ మం డలం కొండపల్లికి చెందిన మరో రైతు కారు పోశన్న(65)ను తొక్కి ప్రాణంతీసింది. గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా, ఏనుగు అకస్మాత్తుగా దాడి చేయడంతో పోశ న్న అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోశన్న కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థులు, కుటుంబసభ్యులు మృతదేహం వద్ద 3 గంటలపాటు బైఠాయించారు. అదనపు కలెక్టర్ వేణు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. ఐదు ఎకరాల భూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని భరోసా ఇచ్చారు.

### గజరాజు ప్రాణాలు తీయడం ఇదే తొలిసారి

ఇప్పటివరకు అడవి నుంచి జనావాసాల్లోకి పులులు ప్రవేశించి మనుషులు, జంతువులపై దాడిచేశాయి కానీ, గజరాజు ఇద్దరి ప్రాణాలు తీయడం ఇదే తొలిసారి. రెండ్రోజుల క్రితం మహారాష్ట్ర గడ్చిరోలి అడవుల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఒక ఏనుగు విడిపోయి ప్రాణహిత నది దాటి జిల్లాలోకి ప్రవేశించినట్టు మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు, జిల్లా అధికారులకు సమాచారం అందించారు. ఏనుగును బంధించేందుకు మహారాష్ట్రకు చెందిన నిపుణులను రప్పిస్తున్నారు. ఏనుగు సంచరిస్తున్న ప్రాంతాల్లో అధికారులు 144 సెక్షన్ విధించారు. గ్రామ శివారు ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. గజరాజు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రకటించారు. ఏనుగు దాడిలో రైతులు మరణించిన ఘటనపై అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అటవీశాఖ అధికారులతో చర్చించారు. ఏనుగును అదుపులోకి తీసుకోవాలని, ప్రజలకు ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### స్వీయ రక్షణ, పర్యవేక్షణకు సౌకర్యాల లేమి

అటవీ అధికారుల స్వీయ రక్షణకు ఆయుధాలు, మందుగుండు, ఇతర రక్షణ సామగ్రి అవసరాన్ని తాజా ఘటన మరోసారి గుర్తుచేసింది. అడవుల సమర్థ పర్యవేక్షణకు ఫారెస్ట్ స్టేషన్లను స్థాపించాలని అటవీశాఖ విజ్ఞప్తి చేసింది. ఇందుకు రూ.9.90 కోట్లు అవసరమని సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి కోసం రూ.4 కోట్లు, 20 ఫారెస్ట్‌స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.5.9 కోట్లు, రాష్ట్రంలోని 64 అటవీ చెక్ పోస్టులను బలోపేతం చేయాలని ప్రతిపాదించారు. ఆయుధాల కొరత, సదుపాయాల లేమి కారణంగా ఇలాంటి జంతువుల దాడులు జరిగినప్పుడు తమ శాఖ లోపాలను బయటపెట్టుకోవాల్సి వస్తుందని అటవీశాఖ అధికారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని రాష్ట్ర అటవీ సేవా అధికారుల సంఘం(ఎస్ఎఫ్ఎస్ఓఏ) గతంలోనే కోరింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్(ఎఫ్ఆర్‌వో) ర్యాంక్, అంతకంటే ఎక్కువ ర్యాంక్‌లకు పిస్టల్స్, స్వీయ రక్షణ కోసం ఫీల్డ్-సిబ్బందికి రైఫిల్స్ అందించాలని డిమాండ్ చేశారు.

### ఏనుగు జాడ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం: పీసీసీఎఫ్

ఏనుగు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పీసీసీఎఫ్ పర్‌గెయిన్ సూచించారు. గురువారం బెజ్జూర్‌లోని అటవీశాఖ అతిథిగృహంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారాంతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అడవుల్లోకి తొలిసారిగా ఏనుగు రావడంతో విచిత్రంగా ప్రవర్తిస్తున్నదని చెప్పారు. ఏనుగుకు కావాల్సిన ఆహారం లేదని, అది ఎక్కువ కాలం ఈ ప్రాంతంలో ఉండదని చెప్పారు. రాత్రిళ్లు కూడా థర్మల్ డ్రోన్లతో ఏనుగు జాడ తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

## ఎట్టకేలకు పాల బిల్లులు విడుదల

- కొంత మేర బకాయిలకే మంజూరు
- 'పాడిరైతులకు పైసల్లేవు'కు అధికారుల స్పందన

నమస్తే ఎఫెక్ట్

కోటగిరి/వర్ని, ఏప్రిల్ 4: పాడి రైతులకు ఎట్టకేలకు గురువారం పాల బిల్లులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాల బిల్లులు నిలిచిపోయాయి. సుమారు రూ.80 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. దీంతో 45 రోజులపాటు బిల్లులు రాక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆగ్రహించిన రైతులు బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఆందోళనకు దిగారు. పశువులకు దాణా కొనుగోలుకు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇతర ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పాడిరైతులకు పైసల్లేవు-విజయ డెయిరీ 80 కోట్ల బకాయి' శీర్షికన గురువారం వార్తను ప్రచురించింది. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి కొంత మేర బిల్లులను విడుదల చేసింది. మొత్తం బకాయిలు చెల్లించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్ని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పరిధిలో 220 మంది రైతులకు విజయ డెయిరీకి పాలు పోస్తుండగా.. రూ.23 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. వారికి గురువారం రూ.8 లక్షలు మాత్రమే విడుదల చేశారు. మిగతా డబ్బులను కూడా వెంటనే చెల్లించాలని సంఘం అధ్యక్షుడు పెనుమర్తి దేవరాజు డిమాండ్ చేశారు. కోటగిరి మండలానికి సంబంధించి సుమారు రూ.6 లక్షలు రావాల్సి ఉండగా.. రూ.1.59 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు దమ్మలపాడి ఉదయ్ తెలిపారు. వీలైనంత తొందరగా మిగతా బకాయిలను కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.




వరంగల్ ఆర్డీవో కార్యాలయం

## ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తు

- టెక్స్‌టైల్ పార్కు భూముల పరిహారం చెల్లింపులో జాప్యం
- కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యమే కారణం

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేయడంతోపాటు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని వరంగల్ ఆర్డీవో కార్యాలయంలోని ఆస్తులను జప్తు చేశారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటకు చెందిన సముద్రాల స్వామి, ఆయన కూతురు వెన్నెలకు సంబంధించిన 20 ఎకరాల భూమిని ప్రభుత్వ టెక్స్‌టైల్ పార్కు కోసం తీసుకున్నారు. ఎకరానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి భూమిలో రోడ్లు వేశారు. అయితే.. నష్టపరిహారం తక్కువగా వస్తుందని పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయిస్తే అప్పీల్‌కు వెళ్లాలని సూచించారు. దీంతో బాధితులు హైదరాబాద్‌లోని ల్యాండ్ అక్విజేషన్ అథారిటీని ఆశ్రయించడంతో.. వరంగల్ భూ నిర్వాసితులకు రూ.2.40 కోట్లు చెల్లించాలని ప్రభుత్వం, ఆర్డీవోకు ఉత్తర్వులు జారీ చేసింది. డబ్బులు చెల్లించకుండా ఆసల్యం చేస్తుండటంతో బాధితులు ఎగ్జిక్యూటివ్ పిటిషన్ వేశారు. అయినా డబ్బులు చెల్లించకుండా జాప్యం చేయడంతోపాటు తమ ఉత్తర్వులను అమలు చేయలేదని భావించిన కోర్టు.. వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఆస్తులు జప్తు చేయాలని ఆదేశించింది. దీంతో గురువారం కోర్టు నుంచి వచ్చిన అధికారులు, సిబ్బంది ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని అక్కడ కోర్టు ఆర్డర్‌ను అంటించారు. అనంతరం కంప్యూటర్లు, ప్రింటర్లు, ఏసీలు, కూలర్లు, ఆర్డీవో వాహనంతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

## 15 లక్షల ఉపాధి నిధులు 'దారి'మళ్లింపు!

- అనుమతిలేని ప్రైవేట్ వెంచర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు!
- ఊరి బయట డ్రైనేజీ పనులు చేపట్టడంపై విమర్శలు



సోన్ మండలంలోని సాకెరలో అనుమతి లేని వెంచర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

సోన్, ఏప్రిల్ 4: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని సాకెర గ్రామంలో ఈజీఎస్ నిధులను 'దారి' మళ్లించారు. ఉపాధి హామీ కింద రూ.15 లక్షలతో నూతనంగా సీసీ రోడ్ల పనులు ఎలాంటి అనుమతులు, గ్రామసభ తీర్మానం లేకుండానే పూర్తిచేశారు. నిధులు దుర్వినియోగం చేసేలా చేపట్టిన పనులు గ్రామస్థులు, వీడీసీ సభ్యుల ఫిర్యాదుతో వెలుగుచూశాయి. గ్రామ అవసరాలకు కాకుండా స్థానికంగా ప్రైవేటు వ్యక్తులు, అనుమతి లేని వెంచర్ల యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా పనులను చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. గ్రామసభ తీర్మానం లేకుండా చేపట్టిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అనుమతులు లేకుండా కొందరికి లబ్ధి చేకూరేలా పనులు చేపడుతుండటం స్థానికంగా విమర్శలకు తావిస్తున్నది. గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా మురికినీరు నిల్వ ఉంటున్నది. ఇటువంటి ప్రదేశాల్లో నిర్మించాల్సి ఉండగా.. గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అనుమతి లేని లేఅవుట్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అదేవిధంగా డ్రైనేజీ పనులను కూడా ఊరి బయట చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విషయమై పంచాయతీరాజ్ ఏఈ శ్రీధర్‌ను వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మరోవైపు గ్రామస్థులు, వీడీసీ సభ్యులు నిర్మల్ కలెక్టర్, జిల్లా, మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో చేపట్టిన పనులపై విచారణ చేయనున్నట్టు తెలుస్తున్నది.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 4: ఆగి ఉన్న లారీని తప్పించే క్రమంలో ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ సమీపంలో 65వ జాతీయ రహదారిపై లారీని నిలిపాడు. అర్వపల్లి నుంచి సూర్యాపేటకు 17 మంది ప్రయాణికులతో వస్తున్న ఆటో లారీని తప్పిస్తుండగా.. వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. దాంతో ముందు ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చింతరెడ్డి సరితారెడ్డి (49), లునావత్ రుక్కమ్మ (55), గొలుసు వేదశ్విని (17 నెలలు) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌కు తరలించారు.

## విశాఖతీరంలో విషపూరిత జెల్లీఫిష్ సంతతి

- గుర్తించిన సముద్ర జీవశాస్త్రవేత్తలు
- మత్స్య పరిశ్రమను, పర్యాటకాన్ని దెబ్బతీస్తాయని శాస్త్రవేత్తల ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఏపీలోని విశాఖపట్నం ఆర్‌కే బీచ్ తీరంలో విషపూరితమైన జెల్లీఫిష్ సంతతిని సముద్ర జీవశాస్త్రవేత్తలు, పరిశోధకులు గుర్తించారు. వీటి సంతతి పెరిగితే మత్స్య పరిశ్రమను, పర్యాటకాన్ని దెబ్బతీస్తాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో అంతరించి పోతున్న మత్స్యజాతులపై పరిశోధనలు చేస్తున్న బృందం.. దేశవ్యాప్త అధ్యయనంలో భాగంగా గురువారం విశాఖపట్నంలో పర్యటించింది. ఆర్‌కే బీచ్ సముద్ర తీరంలో విషపూరితమైన జెల్లీ ఫిష్‌ను శాస్తవేత్తలు గుర్తించారు. మావ్ స్టింగర్ లేదా పర్పుల్-స్ట్రిప్డ్ జెల్లీ ఫిష్ అని పిలిచే అత్యంత ప్రమాదకరమైన పెలాజియా నోక్టిలుకా జాతిగా గుర్తించారు. ఇది వివిధ స్థాయిల అనారోగ్యాలకు కారణమవుతుంది. దేశంలోని తూర్పు తీరంలో అరుదుగా కనిపించే జెల్లీఫిష్ మూడు నుంచి ఐదు సెంటీమీటర్ల పొడవాటి వ్యాసార్థంతో ఉంటుంది. అనేక విషపూరితమైన జెల్లీఫిష్ జాతులను ఆర్‌కే బీచ్ తీర ప్రాంతాల్లో గుర్తించారు.

### ఈ చేపలు విషపూరితం, ప్రాణాంతకం

ఈస్ట్-కోస్ట్ కన్జర్వేషన్ టీమ్‌కు చెందిన సముద్ర పరిశోధకులు చక్రప్రణవ్, దీపు విశ్వేశ్వర్, ఆదిత్య మాధవ్ ఇంటర్ టైడల్ డాటా సేకరణలో భాగంగా తేలియాడే బెలూన్‌ను పోలి ఉండే ఊదారంగులో ఉన్న జెల్లిఫిష్ జాతులను చూసి ఆశ్చర్యపోయారు. రుషికొండ వద్ద ఇసుక బీచ్‌లో రాళ్ల మధ్య నీటిలో ఒడ్డుకు కొట్టుకు వచ్చిన వాటిని గుర్తించారు. చూడటానికి జిగటగా, దృఢంగా అందంగా ఉండే ఈ సముద్ర జీవులు ప్రాణాంతకమైనవి. పెలాజియా నోక్టిలుకా అని పిలువబడే ఈ జెల్లీఫిష్ విషపూరితమైనది. విరేచనాలు, విపరీతమైన నొప్పి, వాంతులు, అనాఫిలాక్టిక్ షాక్ (త్వరగా అభివృద్ధి చెంది ప్రాణాపాయం కలిగించే తీవ్రమైన అలెర్జీ ప్రతిచర్య) వంటి వివిధ స్థాయిల అనారోగ్యానికి కారణమవుతుంది. శరీరంపై వచ్చే మచ్చలు ఏండ్ల తరబడి అలాగే ఉండిపోతాయని చక్ర ప్రణవ్ తెలిపారు. సాధారణంగా అధిక పునరుత్పత్తి రేటు కారణంగా తక్కువ వ్యవధిలో జాతుల జనాభా నాటకీయంగా పెరగడాన్ని జెల్లీఫిష్ బ్లూమ్ అంటారు.


